క్లుప్తంగా

యోగాతో మానసికోల్లాసం



వనపర్తి విద్యావిభాగం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి శనివారం నిర్వహించే వీకెండ్ రిక్రియేషన్ కార్యక్రమంలో భాగంగా వనపర్తి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి షటిల్ ఆట ఆడి ఉత్సాహపరిచారు. అనంతరం నిర్వహించిన హెల్ప్ (హార్ట్‌ఫుల్‌నెస్) కార్యక్రమంలో యోగాసనాలపై ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనంద్, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు సన్మానం

గోపాల్‌పేట: దివ్యాంగులు అందరితో పాటే సమాన భావంతో చూడాల్సిన అవసరం ఉందని వారికి చేయూతనిచ్చి ఆత్మస్థైర్యం కల్పించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని బీజేపీ నాయకులు అన్నారు. శనివారం పీఎం జన్మదిన వేడుకల్లో భాగంగా మండలకేంద్రంలోని కోదండరామస్వామి ఆలయంలో దివ్యాంగులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మండల ఇంచార్జి కదిరెమధు, మాజీ అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి, కౌన్సిల్ మెంబర్ మల్లొక్కర్జున్, జనరల్ సెక్రటరీ వామన్‌గౌడ్, శివ, సీనియర్ నాయకుడు అశోక్‌రెడ్డి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రాజేందర్, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టుల వితరణ



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్ళపల్లితండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్ టై, బెల్టులు, బూట్లను ఎంఈఓ శ్రీనివాసులు చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల కోసం రూ.20 వేల విలువైన సామగ్రిని అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం, గిరిజనులు ఎంఈఓను, దాతను శాలువ, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుర్మన్న, అనిత, ఉపాధ్యాయ బృందం, తండా వాసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆత్మకూర్: కేజీబీవీల్లో విధులు నిర్వహిస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లకు రూ.10లక్షల గ్రాడ్యుటీని ఇవ్వాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో కేజీబీవీ నాన్‌టీచింగ్ ఉద్యోగులతో కలసి ఇనెల 22న చేపట్టనున్న మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సువర్ణమ్మ, పద్మ, బాలమ్మ పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ సభను విజయవంతం చేయాలి

వనపర్తి విద్యావిభాగం: బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ 19వ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆకులశివ పిలుపునిచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 28న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో జరగనున్న సభకు వనపర్తి జిల్లా విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సెల్‌ఫోన్ అందజేత



ఖిల్లాఘనపురం: మండలంలోని ఆముదంబండ తండాకు చెందిన కెతావత్ కాల్య రెండేళ్ల క్రితంతండాలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం జరిగిందని ఏఎస్సై నాగరాజు తెలిపారు. ఫోన్‌ను పోలీసులు గుర్తించి శనివారం బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా క్రైమ్ కానిస్టేబుల్ పి.లింగంను ఎస్సై వి.వెంకటేష్, ఏఎస్సై అభినందించారు. అనంతరం పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక లేక.. ఆగిన నిర్మాణాలు

- డబ్బులు చెల్లించినా ఆన్‌లైన్‌లో దొరకని వైనం
- కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారిన లబ్ధిదారులు
- అలసత్వం వహిస్తున్న అధికారులు



అమరచింతలో బేస్‌మెంట్ వరకే నిలిచిన ఇందిరమ్మ ఇల్లు

అమరచింత: ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తామని ప్రకటించడంతో లబ్ధిదారులు ఇసుక కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని డబ్బులు చెల్లించిన ఇసుక అందకపోవడంతో ఇంటి నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. అమరచింత మున్సిపల్‌లో 69 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటివరకు 15 మంది బేస్‌మెంట్ వరకు నిర్మాణాలను చేసుకున్నారు. వీటిలో 10 మంది లబ్ధిదారులకు మొదటివిడతగా రూ.లక్షతో బిల్లు అందించడంతో మిగిలిన లబ్ధిదారులు త్వరితగతిన తమ ఇంటి నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందుకొస్తున్నా ఇసుక సరఫరాలో జాప్యం కలగడంతో నిరుత్సాహపడుతున్న పరిస్థితులు దాపురించాయి. పట్టణంలోని మిగిలిన లబ్ధిదారులు పిల్లర్లకోసం గుంతలను తవ్వి ఉంచడంతోనే సరిపెట్టుకుంటున్నారు. బుకింగ్ చేసుకున్న ఇసుక త్వరితగతిన వస్తే పిల్లర్లతో పాటు బేస్‌మెంట్ పనులు పూర్తి చేయడానికి అవకాశం ఉందని లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితులు దాపురించాయి. జులై 15 నుంచి ఇప్పటి వరకు 'మనఇసుక' వెబ్‌లో 16 మంది లబ్ధిదారులు ఒక్కొక్కరు మూడు ట్రాక్టర్ల ఇసుకకోసం రూ.4,860 ఆన్‌లైన్‌లో చెల్లించడంతోనే సరిపోయింది. అమరచింత మండలానికి ఆత్మకూర్ మండలంలోని తిపుడంపల్లి ఇసుక రీచ్ ద్వారా ఇసుకను సరఫరా చేయడానికి అనుమతులు ఇవ్వడంతో ఎస్‌ఆర్‌ఓ బుకింగ్ అయిన తరలించడంలో అలసత్వం వహిస్తున్నారు. దీంతో ఎన్నికల షెడ్యూల్ వస్తే తమకు బిల్లులు అందుతాయే లేదో అన్న సందేహాలతో లబ్ధిదారులు ఇసుక మాఫీయా సరఫరా చేస్తున్న ఇసుకను అధికధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారు ఇసుక సకాలంలో సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మన ఇసుక పోర్టర్

ఉన్నతాధికారులకు నివేదించాం..



పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత ఉందనే విషయాన్ని మంత్రి వాకిటి శ్రీహరి, కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. ఆత్మకూర్ మండలంలోని తిపుడంపల్లి ఇసుక రీచ్ కన్న చిన్నచింతకుంట మండలంలోని అల్లిపురం ఇసుక రీచ్ పట్టణానికి తక్కువదూరంలో ఉంటుందని దీంతో ఇసుక రవాణా సకాలంలో జరుగుతుందనే విషయాన్ని వివరించాం. అధికారుల నుంచి ఆదేశాలు వస్తే అల్లిపురం ఇసుక రీచ్ నుంచి ఇసుకను తెప్పించుకుని సకాలంలో ఇళ్లను పూర్తిచేసే అవకాశం ఉందని లబ్ధిదారులు చెబుతున్న విషయాన్ని సైతం మంత్రి దృష్టికి తీసుకెళ్లాం

– నాగరాజ్, మున్సిపల్ కమిషనర్, అమరచింత

బడుల్లో ముందస్తు బతుకమ్మ



అమరచింతో కేజీబీవీలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో శనివారం ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల ఆవరణలో విద్యార్థులు బతుకమ్మలను పేర్చి పూజించి బొడ్డెమ్మలు, కోలాటాలతో బతుకమ్మపాటలు పాడుతూ సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పలువురి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం బతుకమ్మ చెరువులో నిమజ్జనం చేశారు..



మోజర్ల జెడ్పీహెచ్ఎస్‌లో..



మదనాపురం: తిర్మలాయపల్లి పాఠశాలలో..



ఆత్మకూర్‌లోని శ్రీవాణి పాఠశాలలో..



పాన్‌గల్‌లో నిమజ్జనం చేస్తున్న విద్యార్థులు

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పెద్దింటి వెంకటేష్ తండ్రి సుంకన్న అకస్మికంగా మృతి చెందాడు. శనివారం విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే వైశాఖాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పగడాల మన్యం కుమారుడు భరత్ మృతి చెందాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట నాయకులు గట్టుయాదవ్, నందిమల్ల అశోక్, మండల అధ్యక్షుడు రాములు, కర్రెస్వామి, రాజశేఖర్, శంకర్‌నాయుడు, మధు, ఎద్దుల సాయినాథ్, వడ్డె రమేష్, కోట్ల బాలచంద్రారెడ్డి, పరమేష్‌నాయి, రత్నారెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేని ఇసుకట్రాక్టర్లు పట్టివేత

ఆత్మకూర్: అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా తిప్డంపల్లి ఊకచెట్టు వాగునుంచి ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందడంతో శుక్రవారం రాత్రి 1:30 గంటలకు దాడులు నిర్వహించామని తెలిపారు. ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగరాజు అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 8వ వార్డులోని కాలనీల్లో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యూసుఫ్ పాల్గొన్నారు.

పాతపల్లిలో స్వచ్ఛభారత్

వనపర్తి రూరల్: పీఎం నరేంద్రమోదీ జన్మదినం నుంచి సేవాపక్షం స్వచ్ఛభారత్ కార్యక్రమం పెబ్బేరు మండల బీజేపీ అధ్యక్షుడు నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపల్లి గ్రామంలోని చింతలకుంట ఆలయ పరిసరాల్లో చెత్తను సేకరించి పారబోశారు. కార్యక్రమంలో స్థానికసంస్థల ఎన్నికల కన్వీనర్ పురుషోత్తంరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, వెంకట్రామరెడ్డి, దేవేందర్‌నాయకుడు, గోవింద్‌నాయుడు, కె శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఎంబీబీఎస్‌లో సీటు



వీపనగండ్ల: మండలకేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఏ.అఖిల ఎంబీబీఎస్‌లో సీటు సంపాదించడంపై పలువురు అభినందనలు తెలియజేశారు. పంచర్‌షాప్‌ను నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న రాజు, వెంకటేశ్వరమ్మ దంపతుల కూతురు అఖిల నీట్ పరీక్ష 402 మార్కులు సాధించి వనపర్తి మెడికల్ కళాశాలలో సీటు సంపాదించడంపై కుటుంబ సభ్యులు, పలువురు గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు భరోసా..



ఆత్మకూరులో చెక్కు అందజేస్తున్న నాయకులు

గోపాల్‌పేట: పేదలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా నిలుస్తుందని కాంగ్రెస్‌నాయకులు అన్నారు. ఆస్పత్రికి చూపించుకున్న అనంతరం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవతో విడుదలైన చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. బోడోళ్ళ వెంకటయ్యకు రూ.37వేలు, బత్తుల నరసింహకు రూ.32వేలు, వెంగలాయపల్లి బాలరాజుకు రూ.32వేల గల చెక్కులు మంజూరైంది. శనివారం బాధిత కుటుంబ సభ్యులకు పట్టణ అధ్యక్షుడు శివన్న, చంద్రశేఖర్, వనపర్తి ఎస్సీసెల్ అధ్యక్షుడు కొంకివెంకటేష్, మాజీ వార్డు మెంబర్ కేతేపల్లి వెంకటయ్య, బాలయ్య, శాంతయ్య పాల్గొన్నారు.

ఆత్మకూర్: సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరమేష్, యువజన రాష్ట్ర నాయకుడు తులసిరాజ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు ఎంపీడీఓ కార్యాలయంలో వద్ద ముగ్గురికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మధు, భగవంత్, చాంద్‌పాషా, షాలం, లక్ష్మన్న, సాయిరాఘవ ఉన్నారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

వనపర్తి రూరల్: స్వస్త్ నారి శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం పెబ్బేరు పట్టణంలోని పీహెచ్‌సీలో వివిధ గ్రామాలకు చెందిన చిన్నారులకు వైద్యుడు వినోద్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారి ప్రవళిక, హెల్త్ సూపర్‌వైజర్ లీలమ్మ , స్వరూపరాణి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ , తిరుపతయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వినోదా, నర్సింగ్ ఆఫీసర్ కృష్ణ, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె గ్రామంలో శనివారం వైద్యాధికారులు వైద్యశిబిరం నిర్వహించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దగ్గు, జ్వరం ఉన్న వారు విధిగా టీబీ పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యురాలు శ్వేత, సిబ్బంది జహంగీర్, సునంద తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాన్‌గల్: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో స్వస్త్ నారీ శక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా శనివారం నిర్వహించిన ఉచితవైద్య శిబిరం విజయవంతమైందని వైద్యుడు చంద్రశేఖర్ తెలిపారు. చర్మవ్యాధి నిపుణుడు డా.దీప్తి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. దాదాపుగా 76మంది రోగులు వైద్యపరీక్షలు చేయించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు



హోంగార్డులకు రెయిన్‌కోట్స్ అందజేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: హోంగార్డుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం హోంగార్డ్స్‌కు ఉలెన్ జాకెట్స్, రెయిన్ కోట్స్‌ను ఎస్పీ అందజేసి మాట్లాడారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్స్ పోలీసుశాఖలో అంతర్గత భాగమని, పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారన్నారు. వర్షాకాలంలో, చలికాలంలో హోంగార్డ్స్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా విధులు నిర్వర్తించేందుకు ఉలెన్ జాకెట్స్, రెయిన్ కోట్స్ అందజేస్తున్నామన్నారు. ప్రతి పోలీస్టేషన్లో పోలీసు సిబ్బంది తో పాటు విధులు నిర్వహిస్తున్నారని, క్లిష్ట పరిస్థితుల్లో కూడా వివిధ బందోబస్తు విధుల్లో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. హోంగార్డ్స్ అధికారులు, సిబ్బంది ఎవరికైన సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించవచ్చన్నారు. పోలీసుశాఖ సిబ్బంది అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, వనపర్తి సీఐ కృష్ణయ్య, కొత్తకోట సీఐ రాంబాబు, ఆత్మకూరు సీఐ శివకుమార్, సీసీఎస్ సీఐరవిపాల్, స్పెషల్‌బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వ్ సీఐలు అప్పలనాయుడు, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యుత్ బిల్ రీడర్ల ముందస్తు అరెస్ట్

పాన్‌గల్: సమస్యల సాధనకు హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లో నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా మండలంలోని బిల్‌రీడర్లను శనివారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సెక్రటరీ రామకృష్ణ మాట్లాడారు. ఎస్‌పీడీసీఎల్ కంపెనీ పరిధిలో పనిచేస్తున్న బిల్‌రీడర్లకు 30 రోజుల పని దినాలు కల్పించాలని, ఎన్‌పీడీసీఎల్‌లో ఆగస్టు నెల 6న ఇచ్చిన జీఓను ఎస్‌బీడీసీఎల్‌లో కూడా అమలు చేయాలని, ఇచ్చే అరకొర వేతనాలు సరిపోక కుటుంబ భారంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. బిల్ రీడింగ్ రోజులతో పాటు మిగతా రోజుల్లో వారి సేవలను వినియోగించుకుంటూ సెమిస్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తించి తగిన జీతభత్యాలను చెల్లించాలన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో మహేష్, మధుసూదన్, ఎండీ యూసుఫ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందల వెల్లువ



కల్వరాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తకోట రూరల్: ఇటీవల కొత్తకోట పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను శనివారం అభినందించారు. అనంతరం వార్డెన్ సంతోషన్ కుమార్ మాట్లాడుతూ.. వాలీబాల్, కోకో, కబడ్డీ పోటీల్లో ఎస్సీ బాలుర హాస్టర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో చక్కటి ప్రతిభ కనబరుస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వివేకానంద, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, రఘునాథ్, రమేష్, సత్యనారాయణ, పీడీ వెంకటేష్ ఉన్నారు.

వీపనగండ్ల: మండలస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా కల్వరాల ఉన్నత పాఠశాల ఆవరణలో జీహెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు అండర్–14 బాలుర, బాలికల విభాగంలో కబడ్డీ పోటీలో మొదటి స్థానం, అలాగే అండర్17 బాలురవిభాగం కబడ్డీలో ద్వితీయస్థానం పొందడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యాక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

సాయిచంద్ సేవలు మరువలేనివి



అమరచింతలో కేక్‌కట్ చేస్తున్న రజనీసాయి సాయిచంద్

అమరచింత: మండల కేంద్రంలో గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాయిచంద్ జయంతిని శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సాయిచంద్ విగ్రహానికి మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రజనీ సాయిచంద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్ఎ.రాజు, నరసింహలుగౌడ్, రాజ్‌కుమార్, డీజే శేఖర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా సాయిచంద్ జయంతి

వనపర్తి విద్యావిభాగం: తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజా గాయకుడు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ సాయిచంద్ జయంతిని జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిచంద్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ సాయిచంద్ లేని లోటు బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, సీనియర్ నాయకులు వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, నందిమల్ల అశోక్, సూర్యవంశం గిరి, యుగంధర్‌రెడ్డి, జోహెబ్‌హుస్సేన్, ఇమ్రాన్, ఎం.బాలరాజు, సూర్యవంశం నరేందర్, మునికుమార్, రామస్వామి, సలీం, చంద్రశేఖర్, నాగరాజు, వజ్రాల రమేష్, తోట శ్రీను పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్ ఇవ్వాలని దివ్యాంగుల నిరసన

ఖిల్లాఘనపురం: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పింఛన్ ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు గౌరిపాగ లక్ష్మయ్య అన్నారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అప్పారెడ్డిపల్లి, ఖిల్లాఘనపురం, సోలీపురం, రుక్కన్నపల్లి, పర్వతాపురం తదితర గ్రామాల్లో సంఘం ఆధ్వర్యంలో వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు తదితర పింఛన్లు రాని వారు పంచాయతీ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్న ఎన్నికల హామీలను నెరవేర్చలేదన్నారు.

ఆత్మకూర్: దివ్యాంగులకు పెన్షన్ పెంచాలని ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పంచాయతీ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు.



అప్పారెడ్డిపల్లిలో వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.6వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రలాను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, మాసన్న, కృష్ణ, శ్రీను, సోంబాబు, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాకం శ్రీనివాసులు, కుర్మన్న, శంకర్, శ్రీను, శంకర్, బాలరాజు, రామచంద్రి తదితరులు ఉన్నారు.

అధికారులు మారినా.. పేర్లు మారలే



సమాచార బోర్డుపై మారని ఎస్ఐ, ఏఎస్ఐల పేర్లు

అమరచింత: ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సమాచార బోర్డులో అధికారులు మారిన వారి పేర్లు మాత్రం మారడం లేదు. అమరచింత పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించిన సురేష్, ఏఎస్ఐగా కొనసాగిన జమీరుద్దీన్‌లు గత రెండునెలల కిందట ఇక్కడి నుంచి సస్పెండ్ అయ్యారు. ఎస్ఐ స్వాతి, ఏఎస్ఐగా వెంకటయ్య బాధ్యతలు తీసుకున్నారు. అయినా సమాచార బోర్డులో మాత్రం గతంలో విధులు నిర్వహించిన వారి పేర్లు ఉండటంతో పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న వివిధ గ్రామాల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.